క్లుప్తంగా

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

పి.గన్నవరం: మండలంలోని యర్రంశెట్టివారిపాలెంలో తాడేపల్లిగూడెం ఆత్మ బంధువుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 21న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సంఘ సభ్యులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్, రాజమహేంద్రవరం జీఎస్ఎల్ మెడికల్ కళాశాల వైద్య సిబ్బంది పర్యవేక్షణలో ఉచిత వైద్య సేవలు అందిస్తారని వారు వివరించారు. క్యాన్సర్, గుండె, దంత, కంటి వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని యర్రంశెట్టివారిపాలేనికి చెందిన సేవా సంఘ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే అన్నదాన పథకానికి భక్తుల నుంచి విరాళాలు అందుతున్నట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. తాడేపల్లిగూడేనికి చెందిన ఎస్.ముత్యశ్రీనివాసరావు, రాజరాజేశ్వరి రూ.10,116, ఏలేశ్వరానికి చెందిన కె.సత్యనారాయణమూర్తి, శ్యామల రూ.10,116 విరాళం అందించినట్లు ఈవో వివరించారు. దాతలకు ఆలయ చైర్మన్ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందించారు.

పురుగుమందు తాగి వ్యక్తి మృతి

ఆత్రేయపురం: మండలంలోని ఉచ్చిలి గ్రామానికి చెందిన మాగాపు సూరిబాబు (37) కుటుంబ తగాదాలతో విసుగుచెంది ఈనెల 17న పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు.

ఘనంగా రావులమ్మ వార్షికోత్సవం

ఆలమూరు: మండలంలోని సంధిపూడిలో వేంచేసిన రావులమ్మ అమ్మవారి తీర్థం, జాతర బుధవారం ఘనంగా జరిగాయి. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను అందజేసి నైవేద్యాలను సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. గవ్వనృత్యం భక్తులను గగుర్పాటుకు గురిచేసింది. ఆలయం వద్ద నిర్వాహకులు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి నిర్వహించిన జాతరలో మహిళలు ప్రదర్శించిన గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణలు భక్తులను అలరించాయి.

చిన్నారులకు ఆధార్ తప్పనిసరి

అంబాజీపేట/మామిడికుదురు/ఆలమూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆధార్ నమోదు తప్పనిసరిగా చేయాలని సీడీపీఓ కేవీఎల్‌డీ కుమారి, ఐసీడీఎస్ సీడీపీఓ వై.విజయశ్రీ అన్నారు. అంబాజీపేట, మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయాల్లో ఆయా అంగన్‌వాడీ టీచర్లతో బుధవారం వారు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఉన్న చిన్నారులను గుర్తించి వారికి ఆధార్ నమోదు చేయించాలన్నారు. అనంతరం వైఎస్సార్ యాప్‌లో ఆధార్‌ను అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఈఓపీఆర్డీలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బూత్ కమిటీలను వేయాలి

మామిడికుదురు: అన్ని మండలాల్లోనూ బీజేపీ బూత్ కమిటీలను వేసి సరళ్ యాప్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు అన్నారు. మండల పార్టీ ప్రధాన కార్యదర్శి నివాసంలో మండల పార్టీ నాయకుల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కిసాన్ మోర్చ ఐటీ సెల్ కన్వీనర్ కె.తమ్మయ్యనాయుడు, జిల్లా కిసాన్ మోర్చ సోషల్ మీడియా కన్వీనర్ కె.అయ్యన్నస్వామి, మండల ఓబీసీ మోర్చ కార్యదర్శి కె.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న బూత్ కమిటీలు, శక్తి కేంద్రాలు త్వరితగతిన పూర్తిచేసి బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర స్వచ్ఛభారత్ కన్వీనర్ పాలూరి సత్యానందం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం కొత్తపేటలో మండల శాఖ అధ్యక్షుడు పాలాటి మాధవస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యానందం, నియోజకవర్గ పార్టీ కన్వీనర్ అయినవెల్లి సత్తిబాబు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ప్రభుత్వం మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు

మామిడికుదురు: ఈదరాడ గ్రామానికి చెందిన లింగోలు శ్రీనివాస్ అదృశ్యంపై అతడి భార్య గంగాభవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని నగరం ఎస్సై షేక్ జానీబాషా తెలిపారు. కాకినాడకు చెందిన గ్రంధి వీరభద్రరావు లారీపై క్లీనర్‌గా పనిచేస్తున్న తన భర్త ఈ నెల 13వ తేదీన డ్యూటీకి వెళ్లాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. ఆ రోజున కాకినాడ నుంచి కరీంనగర్‌కు నూకల లోడు వెళ్లిందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో లారీ డ్రైవర్ సతీష్ 15వ తేదీన దివాన్‌చెరువు నుంచి తనకు ఫోన్ చేసి మీ భర్త ప్రవర్తన బాగోలేదు. అందుకని దివాన్‌చెరువులో లారీ దింపేస్తున్నట్టు చెప్పాడని గంగాభవాని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి నుంచి తన భర్త ఆచూకీ తెలియడం లేదని, ఫోన్ కూడా పనిచేయడం లేదన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అందుబాటులో అధునాతన పరికరాలు

- పీహెచ్‌సీలకు చేరిన వైద్య సామగ్రి
- ఇకపై 63 రకాల వైద్య పరీక్షలు షురూ


అంబాజీపేట పీహెచ్‌సీలో అధునాతన పరికరాలు

అంబాజీపేట: ఇకపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల్లో రోగులకు మరిన్ని వైద్య పరీక్షలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం వైద్య, ఆరోగ్యశాఖ అధునాతన యంత్ర పరికరాలను పీహెచ్‌సీలకు అందజేసింది. ఒక్కో పీహెచ్‌సీకి సీబీసీ, ఎలక్ట్రోలైట్ అనలైజర్, బయోకెమిస్ట్రీ అనలైజర్, యూరిన్ ఎనలైజర్, టీబీఆర్టీఆర్ యంత్ర పరికరాలను సమకూర్చారు. ఇప్పటి వరకూ పీహెచ్‌సీల్లో కేవలం 15 నుంచి 20 రకాల వైద్య పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉండేవి. కొత్తగా చేరిన పరీక్షలతో కలిపి ఇకపై వాటి సంఖ్య 63కు పెరగనుంది. వైద్య పరీక్షల నిర్వహణ కోసం ప్రతి పీహెచ్‌సీకి ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను కూడా నియమించారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 14, రాజోలు నియోజకవర్గంలో 8, కొత్తపేట నియోజకవర్గంలో 16 పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలు చేయనున్నారు.

ఎంతో ఉపయోగం..

గతంలో పీహెచ్‌సీలో చాలా రకాల వైద్య పరీక్షలు ప్రస్తుతం అదనపు వైద్య పరీక్షలు పీహెచ్‌సీలో అందుబాటులో లేకపోవడంతో వాటి కోసం రోగులు సమీప ఏరియా, లేదా జిల్లా కేంద్రంలోని ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఇది సహజంగానే రోగులకు ఆర్థిక భారం అయ్యేది. అదనంగా అందుబాటులోకి రావడంతో కొన్ని గంటల వ్యవధిలోనే రోగులు వ్యాధి నిర్ధారణకు వీలవుతుంది. ఫలితంగా వెంటనే రోగికి మెరుగైన వైద్యసేవలు అందించడానికి అవకాశం కలుగుతుందని వైద్యాధికారులు చెబుతున్నారు. సీఆర్పీ, ఎసీఓటీ, ఎసీపీటీ, యూఆర్ఏతో పాటు హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్ కౌంట్, సీబీసీ, టోటల్ బ్లడ్ సెల్ కౌంట్, ర్యాండమ్ బ్లడ్ సుగర్, బ్లడ్ యూరియా, సీరం సోడియం, తదితర 63 రకాల పరీక్షలు చేయనున్నారు.

పరికరాలు పీహెచ్‌సీకి చేరాయి



రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయడానికి అవసరమైన పరికరాలు, మెషినరీ ఇప్పటికే పీహెచ్‌సీకి చేరాయి. వైద్య పరీక్షలు ఎలా చేయాలో ప్రాథమికంగా కొంత శిక్షణ కూడా ఇచ్చారు. త్వరలోనే పీహెచ్‌సీలో పేదలకు అన్ని రకాల పరీక్షలు ఉచితంగా అందుబాటులోకి వస్తాయి.

– పి.రవితేజ, ల్యాబ్ టెక్నీషియన్, అంబాజీపేట పీహెచ్‌సీ

పీహెచ్‌సీల్లోనే వైద్య పరీక్షలు



రోగులకు అవసరమైన 63 రకాల వైద్య పరీక్షలు పీహెచ్‌సీలో అందుబాటులోకి వచ్చాయి. ఇకపై వైద్య పరీక్షల కోసం ఏరియా ఆస్పత్రులకు, ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లనవసరం లేదు. త్వరగా రోగ నిర్ధారణ అయ్యి, వెంటనే వైద్య సేవలు అందిస్తాం. నీ వైద్య పరీక్షలు నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

– కేఎస్ శ్రీనివాస్, వైద్యాధికారి, అంబాజీపేట పీహెచ్‌సీ

మేలు జాతి లేగదూడల ప్రదర్శన


లేగదూడల ప్రదర్శనలో రైతులకు ఉచిత మందుల కిట్ అందిస్తున్న దృశ్యం

మలికిపురం: కృత్రిమ గర్భధారణ ద్వారా జన్మించిన మేలు జాతి లేగ దూడల ప్రదర్శన బుధవారం లక్కవరం పశువైద్యశాల వద్ద జరిగింది. మలికిపురం సహాయ సంచాలకుడు డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు లేగదూడల ప్రదర్శన శిబిరాన్ని ప్రారంభించారు. 40 లేగదూడల ప్రదర్శనలో పాల్గొనగా మొదటి స్థానంలో రుద్రరాజు బుజ్జిరాజుకు చెందిన గిర్ దూడ, రెండో స్థానంలో తోట పెద్దిరాజుకు చెందిన లేగదూడ, మూడవ స్థానంలో ముదునూరి వేణురాజుకు చెందిన లేగదూడ నిలిచాయి. అలాగే దాట్ల జోగేంద్రవర్మకు చెందిన పుంగనూరు లేగదూడ ప్రత్యేక బహుమతి సాధించింది. ప్రదర్శనలో పాల్గొన్న దూడల రైతులకు ఒక లీటరు స్టీలు క్యాన్, దూడలకు బలవర్ధకమైన కాల్షియం టానిక్స్, ఇతర మందులు కిట్‌ను ఉచితంగా అందజేశారు. మండల పశువైద్యాధికారి డి.శివకుమార్ మాట్లాడుతూ లేగదూడల సంరక్షణ–యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పశువైద్యాధికారులు సురేష్, సునీల్‌గాంధీ, మంగెన సింహాద్రి, దొరబాబు, మంగెన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీరవల్లిపాలెంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జి.వెంకటేష్ బుధవారం పర్యటించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న పీహెచ్‌సీ భవనాన్ని, అలాగే సచివాలయ భవనాన్ని పరిశీలించారు. ఈ భవనాలను త్వరితగతిన ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ అశోక్, సర్పంచ్ సలాది బుచ్చిరాజు, వైస్ ఎంపీపీ అడపా నాగభూషణం తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

కొత్తపేట: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు బుధవారం స్థానిక ఫైర్ ఆఫీస్ సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రిలో 'అగ్నిప్రమాదాలు–నివారణ చర్యలు' పై అవగాహన కల్పించారు. స్థానిక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ బి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద వైద్యులు, సిబ్బందికి, పేషెంట్లకు, వారి సహాయకులకు గ్యాస్ ప్రమాదాలు – తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రయోగాత్మకంగా అగ్నిమాపక ప్రక్రియను ప్రదర్శించారు. వివిధ సందర్భాల్లో ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు నివారణపై ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సి.హనుమాన్, ఆస్పత్రి సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- మెర్లపాలెంలో గడప గడపకూ..


మెర్లపాలెంలో గడప గడపకు ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి


మాచవరంలో లబ్ధిదారులకు బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ఆత్రేయపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరంతరాయంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆయన బుధవారం సాయంత్రం ఆత్రేయపురం మండలంలో మెర్లపాలెం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తుంటే అడుగడుగునా అవ్వాతాతలు ఆశీర్వాదాలు, ఆడపడుచులు అభిమానం, రైతన్నల ఆనందంతో గ్రామంలో ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాగా పనిచేస్తున్నారని పథకాలు చక్కగా అందుతున్నాయన్నారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎలాంటి రికమెండేషన్లు లేకుండా అర్హతే ఉంటే అన్ని పథకాలు అందిస్తుందన్నారు. మెర్లపాలెంలో మాజీ సర్పంచ్ జంపన సుబ్బరాజు, పార్టీ సీనియర్ నేతలు పోలిమాటి రాజారత్నం, త్రిమూర్తులు, నాని, వీర్రాజు తదితరుల ఆధ్వర్యాన ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గడప గడపకూ కార్యక్రమం నిర్వహించి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం ధ్యేయం : ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరం సచివాలయం–4లో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో గడపగడపకూ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ పాలనలో అందిన సంక్షేమ లబ్ధిని వివరించారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా పేదలు, ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు సీఎం జగన్ అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. మహిళలు, ఆర్థికాభివృద్ధి సాధించేందుకు పలు పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారన్నారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం మహిళలకే కేటాయించి మహిళా పక్షపాతిగా పేరు పొందారన్నారు. రహదారులు, డ్రైనేజీలు నిర్మించాలని, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, పట్టాలు ఇప్పించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల గ్రీవెన్స్ విభాగం కన్వీనర్ పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, ఎంపీటీసీ మట్టా పార్వతి, పార్టీ జిల్లా ప్రచార విభాగ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, ముత్తాబత్తుల ప్రశాంత్, కుసుమ వరలక్ష్మి, మట్టా వెంకటేశ్వరరావు, కుడుపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రోటరీ వ్యవస్థాపకుడు హారిస్ జయంతి


రాజోలు రోటరీ భవనం వద్ద పాల్ హారిస్ జయంతి నిర్వహిస్తున్న రోటరీ ప్రతినిధులు

రాజోలు: రోటరీ క్లబ్ వ్యవస్థాపకుడు పాల్ హారిస్ జయంతిని రాజోలు రోటరీ క్లబ్ ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పాల్ హారిస్ చిత్రపటానికి రోటరీ అధ్యక్షుడు దార్ల పెదబాబు, కార్యదర్శి లక్కింశెట్టి చిన్మయుడు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. బోళ్ల శ్రీనివాస్, కాసు శ్రీనివాస్, నామన షణ్ముఖేశ్వరరావు, ఐ.సూర్యనారాయణ, కంచర్ల పూర్ణచంద్రరావు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే

ఆలమూరు: పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే జరిగింది. పెనికేరులో ఇటీవల కోవిడ్–19 లక్షణాలతో యువకుడి మృతితో వైద్యారోగ్య అప్రతమ్తమైంది. వైద్యాధికారి పి.భవానీశంకర్ నేతృత్వంలో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫీవర్ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వివరాలు నమోదు చేసుకుని ట్యాబ్‌లో నిక్షిప్తం చేశారు. జ్వరపీడితులకు, ఇతర వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు అందజేశారు. మృతుడు కుటుంబసభ్యులకు కోవిడ్–19 పరీక్షలు నిర్వహించగా నెగెటివ్ వచ్చినట్లు వైద్యాధికారి భవానీశంకర్ పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి అయ్యన్న, ఏఎన్ఎంలు టి.సుశీల, కె.రాణి పేర్కొన్నారు.

విశ్వవ్యాప్తంగా కీర్తిస్తున్న మేధావి అంబేడ్కర్


కొత్తపేట అంబేడ్కర్ జయంతిలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు డేవిడ్‌రాజు

కొత్తపేట: విశ్వవ్యాప్తంగా ముక్తకంఠంతో కీర్తిస్తున్న మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని రాష్ట్ర వైఎస్సార్ సీపీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు అన్నారు. స్థానిక కమ్మిరెడ్డిపాలెం దళితపేట పెద్దలు, యూత్ ఆధ్వర్యంలో బుధవారం అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. సభకు బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అంబటి సత్యనారాయణ అధ్యక్షత వహించగా గొల్లపల్లి డేవిడ్‌రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ భారతీయ సమాజంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక అసమానతలు తొలగిపోవాలని కాంక్షించి ఆ దిశగా రాజ్యాంగాన్ని రూపకల్పన చేశారన్నారు. అంబేడ్కర్ మేధాసంపత్తి వల్లే భారతదేశం ప్రపంచ దేశాల్లో ఒక ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ఆ మహాపురుషుని ఆశయాలు, ఆలోచనా విధానంతో ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువత ముందుకు వెళ్లి విద్యా, ఉద్యోగ, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి డేవిడ్‌రాజు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, జిల్లా మాలమహానాడు కార్యదర్శి జక్కల అరుణ్‌కుమార్, శేషారత్నం, దళిత పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు బొక్కే స్టీఫెన్ బాబు, నేతుల సత్యానందం, మాగాపు బాలకృష్ణ, అంబటి జీవరత్నం, బీర ఇస్సాక్, వాడ సద్గుణరావు, వాడ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం దళిత యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ ర్యాలీ నిర్వహించారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి గౌతు లచ్చన్న


కొత్తపేటలో గౌతు లచ్చన్నకు నివాళులర్పిస్తున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

కొత్తపేట: బలహీన వర్గాల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న అని శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి సందర్భంగా స్థానిక ఆర్ఎస్ బీసీ కన్వెన్షన్ హాలు వద్ద ఆయన విగ్రహానికి రెడ్డి సుబ్రహ్మణ్యం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శెట్టిబలిజ, గౌడ, శ్రీశయన, యాత, ఈడిగ కులాలు ఐకమత్యంగా అభివృద్ధి సాధించాలన్న సర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధన లక్ష్యంగా అందరూ ముందుకు వెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు కముజు గంగాధర్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు గుబ్బల మూర్తి, మండల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కముజు వెంకటేశ్వరరావు, గుబ్బల సత్తిపండు, కముజు తాతాజీ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తుల జాగ్రత్తలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జి.వెంకటేష్ ఆధ్వర్యంలో ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ బృందం కమాండర్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రకుమార్ సారణ్ ఆధ్వర్యంలో ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వరదలు, వర్షాలు, తుపాన్లు, అగ్నిప్రమాదాలు వంటివి వచ్చినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, సర్పంచ్ సలాది బుచ్చిరాజు, వైస్ ఎంపీపీ అడపా నాగభూషణం, డిప్యూటీ తహసీల్దార్ ఆర్ఐ కృష్ణార్జునుడు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం పనులు చేయాలి

అంబాజీపేట: జాతీయ ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు చేపట్టాలని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంకలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం పరిశీలించారు. సర్పంచ్ మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని ఉపాధి కూలీలకు అందుబాటులో మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. ఉపాధి కూలీలకు ఎదురవుతున్న సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ కూలీలకు చెప్పారు.

తారతమ్యాలు లేకుండా సంక్షేమం


బట్టేలంకలో జగనన్నే మా భవిష్యత్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: ఎలాంటి తారతమ్యాలు లేకుండా అర్హత ఒక్కటే ప్రమాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం బట్టేలంకలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాపాక పాల్గొన్నారు. గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటా తిరుగుతూ ప్రజాభిప్రాయాలను సేకరించారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: నవరత్నాల ద్వారా ప్రజల సంక్షేమ కోసం పనిచేస్తున్న సీఎం జగన్‌కి అండగా నిలవాలని జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, సర్పంచ్ కట్టా గోపాలకృష్ణ గోఖలే, ఎంపీటీసీ నూకపెయ్యి సత్యనారాయణ అన్నారు. మొసలపల్లిలో సత్యమోహన్ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాలపై ప్రజలను ఆరా తీశారు. ఇంటి యజమానికి పథకాలను వివరించి వారి అనుమతితో స్టిక్కర్లు అతికించారు.

జగనన్న శాశ్వత భూహక్కు సర్వేపై ఆర్డీవో సమీక్ష


పాశర్లపూడి బాడవలో రైల్వే లైన్ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీవో వసంతరాయుడు

మామిడికుదురు: జగనన్న శాశ్వత భూహక్కు సర్వేపై అమలాపురం ఆర్డీవో ఎస్.వసంతరాయుడు బుధవారం సమీక్ష నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ అధ్యక్షతన సమావేశం జరిగింది. గెద్దాడ, కొమరాడ, మాకనపాలెం గ్రామాల్లో చేపట్టిన రీ సర్వేపై ఆయన చర్చించారు. గెద్దాడ గ్రామంలో రీసర్వే పూర్తయిందని మిగిలిన రెండు గ్రామాల్లోను సర్వే కొనసాగుతుందన్నారు. పాశర్లపూడిలో రైల్వే లైన్ నిర్వాసితులు 68 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అక్కడ కల్పించవలసిన మౌలిక వసతులపై కూడా చర్చించారు. నిర్వాసితుల కాలనీలో రోడ్ల నిర్మాణం, తాగునీటి వసతి, విద్యుదీకరణ తదితర అంశాల గురంచి ఆయన మాట్లాడారు. సమావేశంలో వీఆర్వోలు, విలేజ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ప్రహరీ పనులను ఆయన పరిశీలించారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

మామిడికుదురు: విద్యార్థుల మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని ఎంపీపీ కుసుమ వనజకుమారి పేర్కొన్నారు. ఈదరాడలోని సిద్ధార్థపేట మండల పరిషత్ పాఠశాలకు గోసంగి అమ్మాజీ సమకూర్చిన ఆట వస్తువులను ఎంపీపీ బుధవారం ఆవిష్కరించారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా దృష్టి సారించాలన్నారు. పీఎంసీ చైర్మన్ కుసుమప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానికులు కత్తుల నాగరాజు, కుసుమ శ్రీధర్, కుసుమ పెరుమాళ్లకుమార్, నరేష్, కల్యాణ్, ఉపాధ్యాయులు షబ్బీర్ హుస్సేన్, సర్కిల్ ఫకార్ సాహెబ్ పాల్గొన్నారు.

ఆలమూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా 'సలాది'


సలాది సత్యనారాయణమూర్తి

ఆలమూరు: స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ప్రముఖ సీనియర్ న్యాయవాది సలాది సత్యనారాయణమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం కార్యవర్గం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా సలాది సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడిగా ఎం.సత్యనారాయణ, కార్యదర్శిగా ఎం.మహేశ్వరరావు నియమితులయ్యారు. అయితే సంయుక్త కార్యదర్శి, కోశాధికారి పదవులకు పోటీ నెలకొనడంతో ఎన్నిక అనివార్యమైంది. అధ్యక్షుడిగా ఎన్నికైన సత్యనారాయమూర్తిని పలువురు న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

రావులపాలెం: మండలంలోని వెదిరేశ్వరం శివారు బొక్కావారిపాలేనికి చెందిన గుబ్బల రేవంత్ గత కొన్ని రోజులుగా సుగర్, కడుపులో ఇన్ఫెక్షన్ కారణముగా అపస్మారక స్థితిలో మంచంపై ఉన్నాడు. వైద్యులు ఇతడికి శస్త్రచికిత్స చేయాలని సూచించారు. పేదరికం వలన వైద్యం చేయించుకోలేక ఇబ్బంది పడుతున్న అతడి పరిస్థితి తెలుసుకున్న రావులపాలెం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు అతడికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అతడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం


మామిడికుదురులో రంజాన్ తోఫా కిట్లను అందజేస్తున్న డీఆర్వో సత్తిబాబు

మామిడికుదురు: పేదలకు స్వచ్ఛంద సంస్థల సేవలు ప్రశంసనీయమైనవని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు పేర్కొన్నారు. మామిడికుదురులోని హుస్సేనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సమావేశంలో 200 మంది పేదలకు రూ.3.80 లక్షలు విలువైన రంజాన్ తోఫా కిట్లను డీఆర్వో లబ్ధిదారులకు అందజేశారు. ముంబయిలోని అలీమాన్ ట్రస్ట్ నజతిహౌస్ ఆధ్వర్యంలో ఈ కిట్లను సమకూర్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మీర్జా ఖాదమ్‌హుస్సేన్, సర్పంచ్ గౌస్ మోహిద్దీన్, అన్సర్ తాహీర్‌హుస్సేన్, రజాక్ అలీ, సజ్జాద్ హుస్సేన్, నూరైన్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.